ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 6 జూన్ 2025





స్టేడియంలోని గ్యాలరీని పరిశీలిస్తున్న హోంమంత్రి పరమేశ్వర్

తొక్కిసలాటకు.. కారకులెవరు..?

- అంతా గందరగోళమే..
- కిలోమీటర్ పరిధిలోనే రెండు చోట్ల సంబరాలా?
- ఉచిత పాసులు ప్రకటించింది ఎవరో?

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీబీ జట్టు గెలుపొందిన వేళ సంబరాలకు పిలుపునిచ్చింది. తొక్కిసలాటకు కారకులెవరేది బాధిత కుటుంబీకులతో పాటు హైకోర్టు ధర్మాసనం కూడా తీవ్రంగా స్పందించింది. సంఘటనలో ఏకంగా 11 మంది మృతిచెందగా సుమారు 40మంది ప్రాథమిక చికిత్సలతో ఇళ్లకు వెళ్లారు. మరో పదిమంది చికిత్సలు పొందుతున్నారు. బుధవారం సాయంకాలం చోటు చేసుకున్న ప్రమాదం జాతీయ స్థాయిలో తీవ్రమైన అంశంగా మారింది. సంబరాలు అంతా గందరగోళమనేలానే సాగినట్లుగా అనిపిస్తోంది. మంగళవారం దాదాపు అర్ధరాత్రి అయ్యేసరికి ఆర్‌సీబీ జట్టు విజేతగా నిలిచింది. 17 ఏళ్ల పాటు ట్రోఫీ కోసమే ఎదురుచూసిన అభిమానులలో ఎనలేని ఉత్సాహం రాత్రికిరాత్రి పెల్లుబికింది. బెంగళూరు సహా రాష్ట్రమంతటా తెల్లారేదాకా వేడుకలు జరిగాయి. అప్పటి దాకా బెంగళూరుకు క్రీడాకరులు వస్తారనేది కానీ సంబరాలు చేస్తారనేది తెలియదు. అటువంటిది బుధవారం 10 గంటల తర్వాత సమాచారం బహిరంగమైంది. ట్రోఫీతో పాటు క్రికెటర్లు బెంగళూరుకు వస్తున్నారని విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం దాకా ఊరేగింపు ఉంటుందని ప్రచారం జరిగింది. అంతలోనే స్టేడియానికి క్రీడాకారులు వస్తారని, పాసులు ఉన్నవారికి మాత్రమే లోపలకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందని ప్రచారం సాగింది. అంతలోనే ఆన్‌లైన్‌లోనే పాసులు పొందవచ్చనే సమాచారంతో వేల మంది తీసుకున్నారు. ఇక స్టేడియం వద్ద పాసులు ఇస్తారంటూ ప్రచారం సాగింది. దీంతో అభిమాన క్రికెటర్‌లు బెంగళూరుకు రాక ముందే అభిమానులు స్టేడియం వద్దకు వచ్చారు. పాసుల కోసం పలు గేట్‌ల వద్ద సందడి నెలకొంది. ఆతర్వాత ఊరేగింపు ఉండదని విధానసౌధ వద్ద ప్రభుత్వం తరుపున సన్మానం ఉంటుందని ప్రకటించారు. అంతలోనే జట్టు సభ్యులు బెంగళూరుకు రాగా డీసీఎం డీకే శివకుమార్ హెచ్‌ఏఎల్ విమానాశ్రయంకు వెళ్లి స్వాగతించి వచ్చిన ఫొటోలు వైరల్ అయ్యాయి. సాధారణంగానే ఆర్‌సీబీ అంటే అదో సెంటిమెంట్‌గా భావిస్తారు. ఇక ట్రోఫీతో బెంగళూరుకు జట్టు ప్రత్యేకించి విరాట్ కోహ్లీ వచ్చారని దగ్గరగా చూడాలని అభిమానులలో ఉత్సాహం పెల్లుబికింది. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు మధ్యాహ్నం రెండుగంటలకే విధానసౌధ, స్టేడి



విధానసౌధ వద్ద దెబ్బతిన్న బారికేడ్

యంల వద్ద వేలాదిమంది చేరారు. సాయంత్రం అయ్యేసరికే విధానసౌధ పరిసరాలలో కనీసం లక్షమంది, స్టేడియం వద్ద ఏకంగా మూడు లక్షల మంది చేరారు. స్టేడియంలో 35వేల సీట్లు మాత్రమే ఉండటంతో ఎలాగైనా లోపలికి చేరాలనే ఆత్రుత ప్రతి ఒక్కరిలోను కనిపించింది. స్టేడియంకు గేట్‌లు ఉండే కబ్బన్‌పార్క్, రాజభవన్ రోడ్లు పూర్తిగా జన సంద్రంగా మారింది. సాయంత్రం 5గంటల వేళ విధానసౌధ వద్ద సభ



స్టేడియం బయట తొక్కిసలాటలో గుట్టలుగుట్టలుగా పడిన చెప్పులు

ప్రారంభం కాగానే స్టేడియం గేట్‌లు ఒక్కసారిగా తెరిచేశారు. విధానసౌధ వద్ద సన్మానాలు జరుగక ముందే స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగిపోయింది. ఊహించని సంఘటన జరిగినా పోలీసు ఉన్నతాధికారులు స్టేడియం వద్దకు కాకుండా విధానసౌధ కార్యక్రమంలోనే గడిపారు. అక్కడా వేలాది మందిని నియంత్రించేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. పెనుప్రమాదం తర్వాతనే విధానసౌద వద్ద సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రమాద విషయం పోలీసు అధికారులు సీఎం, డీసీఎంలకు ఎప్పుడు తెలిపారనేది కూడా సందేహంగానే ఉంది. విధానసౌధ నుంచి క్రీడాకారులు హోటల్‌కు వెళ్ళిపోతారనే ప్రచారం జరిగింది. కానీ 11 మంది మృతి చెందిన స్టేడియంలోను సంతోషంగా షీల్డుతో మైదానంలో క్రీడాకారులు తిరగడం, అభివాదం చేస్తూ సంతోషంగా గడపడం పలువురిని బాధకలిగించింది. జాతీయ క్రికెటర్‌లు సంబరాలపై విమర్శలు చేశారు. రాత్రి సీఎం సిద్దరామయ్య అత్యవసరంగా మీడియా ముందుకు వచ్చి పోలీసులది తప్పులేదని పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. అప్పటికి 11 మంది మృతి చెందగా వారి కుటుంబీకుల ఆర్తనాదాలు



స్టేడియం 10వ గేటును పరిశీలిస్తున్న విచారణాధికారి జగదీష్

మిన్నంటాయి. ప్రజలు ఎంతమంది రావచ్చునని కానీ గంటగంటకూ పెరుగుతున్న అభిమానులను బట్టి ఇంటెలిజెన్స్ ఏమాత్రం ముందస్తు చర్యలకు దిశానిర్దేశం చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

హైకోర్టు చీవాట్లు... మెజిస్టీరియల్ అధికారి నోటీసులు

తొక్కిసలాటపై గురువారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. బౌరింగ్ ఆసుపత్రి, విక్టోరియా ఆసుపత్రులలో మృతి చెందిన అభిమానులకు పోస్టుమార్టం ప్రక్రియ ముగించి బంధువులకు అప్పగించారు. కాగా హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా పిల్ దాఖలు చేసి విచారణలకు ఆదేశించారు. కానీ అడ్వొకేట్ జనరల్ సమాచారం కోసం మధ్యాహ్నం విచారణలు జరుపుతామని ఆదేశించింది. విచారణల వేళ ప్రభుత్వ తీరును తప్పు పట్టింది. వారు ఏదేశంపైన గెలుపొందారని భావించారని ఇంతకూ కిలోమీటర్ దూరంలోనే రెండుచోట్ల ఎందుకు సన్మానాలు పెట్టారంటూ మందలించింది. విచారణలను 10వ తేదీకి వాయిదా వేసి, నివేదిక సమర్పించాలని అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు కబ్బన్‌పార్క్ పోలీసులు అసహజ మరణాలుగా కేసు నమోదు చేసింది. ప్రభుత్వం మెజిస్ట్రీరియల్ విచారణాధికారిగా బెంగళూరు నగర జిల్లాధికారి జగదీష్‌ను నియమించింది. దర్యాప్తులో భాగంగా చిన్నస్వామి స్టేడియంను అధికారులతో కలిసి పర్యటించారు. ఆర్‌సీబీ పాలక వర్గానికి, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కు, నగర పోలీసు కమీషనర్‌కు నోటీసులు ఇస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు మృతుల కుటుంబీకులు, క్షతగాత్రుల నుంచి కూడా వివరాలు సేకరిస్తామన్నారు. ఈనెల 13న నగర జిల్లాధికారి కార్యాలయంలో వినతులు, అభిప్రాయాలు స్వీకరిస్తామని ప్రకటించారు. హోంమంత్రి పరమేశ్వర్ పోలీసు ఉన్నతాధికారులతో పాటు స్టేడియంను సందర్శించి సంఘటన వివరాలను తెలుసుకున్నారు.

కేంద్ర మంత్రి పరామర్శ

వివిధ ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులను కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె పరామర్శించి ఓదార్చారు. డాక్టర్‌లతో చర్చించి ఉన్నత వైద్యం అందించాలని కోరారు. ఎట్టకేలకు ఆర్‌సీబీ స్పందించి మృతుల కుటుంబీకులకు పదిలక్షల పరిహారం ఇస్తామని ఎక్స్‌లో వెల్లడించింది. క్షతగాత్రులకు ఆర్‌సీబీ కేర్స్ ద్వారా సాయం అందిస్తామని ప్రకటించింది



బాధితుడిని పరామర్శిస్తున్న కేంద్ర మ్రంతి శోభాకరంద్లాజె

నగర పోలీస్ కమిషనర్‌పై వేటు

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిలాట సంఘటనపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. నగర పోలీసు కమిషనర్ బి. దయానంద్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆయనతో పాటు అదనపు పోలీస్ కమిషనర్ వికాస్ కుమార్, సెంట్రల్ డీసీపీ టి. శేఖర్, కబ్బన్‌పార్క్ ఏసీపీ బాలకృష్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరీష్‌తోపాటు పలువురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బెంగళూరు నగర కమిషనర్‌గా ఒక ఏడాది మాత్రమే కొనసాగిస్తారు. గత కొన్నేళ్లుగా ఈ సంప్రదాయం ఉంది. ఏటా డిసెంబరు లేదా జనవరిలో కమిషనర్‌ను బదిలీ చేసేవారు. అయితే దయానంద్ సుదీర్ఘకాలంగా కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఒకటి రెండుఆసర్లు ఆయన బదిలీపై ఊహాగానాలు వచ్చినా అందుకు ప్రభుత్వం సమ్మతించలేదు.

భారీ సభలకు కొత్త ఎస్‌ఓపీ రూపకల్పన

● హోంమంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇకపై జరిగే భారీ బహిరంగ సభలకు స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ని రూపొందించనున్నట్లు హోంమంత్రి పరమేశ్వర్ వెల్లడించారు. గురువారం హోంమంత్రి, నగర పోలీసు ఉన్నతాధికారులతో కలసి చిన్నస్వామి స్టేడియంను సందర్శించారు. ఆర్‌సీబీ విజయోత్సవాల వేళ చోటుచేసుకున్న ఘటనపై విచారం వ్యక్తం చేశారు. స్టేడియం వద్ద జరిగిన సంఘటన గతంలో ఎన్నడూ రాష్ట్ర పరిధిలో జరుగలేదన్నారు. ఎక్కడ తప్పు జరిగిందనే సమగ్ర వివరాల కోసం మెజిస్ట్రేట్ విచారణలకు ఆదేశించామన్నారు. బెంగళూరు నగర జిల్లాధికారి నేతృత్వంలో విచారణలు జరుగుతాయన్నారు. తప్పు ఎవరి ద్వారా జరిగినా చర్యలు ఉంటాయన్నారు. ప్రమాదంలో 11 మంది మృతి చెందారన్నారు. 56 మంది గాయపడ్డారన్నారు. వీరిలో దాదాపు 46 మంది ప్రజలు ప్రాథమిక చికిత్సలు పొంది డిశ్చార్జి అయ్యారన్నారు. పదిమంది ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారన్నారు. హోంశాఖ ద్వారానే భవిష్యత్తులో ప్రత్యేకంగా ఎస్ఓపీ చేస్తామన్నారు. భవిష్యత్తులో ఎక్కడ భారీ సభలు, విజయోత్సవాలు జరపాలన్నా ముందుగా పోలీసుశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగానే నిర్వహిస్తామన్నారు. అమాయకులు మృతిచెందారని విచారం వ్యక్తం చేశారు. పలు గేట్‌ల వద్ద రాసుల కొలదీ చెప్పులను చూశానన్నారు. వైదేహి ఆసుపత్రి వద్ద కుమారుడిని కోల్పోయిన తండ్రి ఒకరు వేదన బాధకలిగించిందని అన్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కాలేజీకంటూ వచ్చి మృతి చెందారని ఎంత ఆస్తి ఉంటే ఏం లాభమని ఏడ్చారన్నారు. స్టేడియం సామర్థ్యం 35 వేలు కాగా సుమారు 3 లక్షల మంది ప్రాంగణంలోకి వచ్చారని, లోపలకి ప్రవేశిస్తే చాలనే ఆత్రుత కారణమైందన్నారు. నమ్మ మెట్రో అధికారుల సమచారం మేరకు బుధవారం ఏకంగా తొమ్మిది లక్షల మంది ప్రయాణించారన్నారు. ఆర్‌సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌తోనూ చర్చిస్తామన్నారు. డీజీపీ సలీంతో పాటు నగరపోలీసు కమిషనర్ దయానంద్ సాంకేతిక అంశాలకు అనుగుణంగా పరిలిస్తారని తెలిపారు.

కనకపుర కోర్టుకు హాజరైన డీసీఎం



బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కనకపుర కోర్టు విచారణకు డీసీఎం డీకే శివకుమార్ హాజరయ్యారు. విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్‌పై డీకే శివకుమార్ దాఖలు చేసిన పరువునష్టం కేసుకు స్వయంగా పిటిషనర్ విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించిన మేరకు బుధవారం ఆయన వెళ్లారు. డీకే శివకుమార్ అక్రమాస్తులకు సంబంధించిన ఈడీ, సీబీఐ విచారణలు జరిపిన విషయం తెలిసిందే. బీజేపీ ప్రభుత్వం అనుమతుల మేరకు సీబీఐ విచారణ జరిపింది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీబీఐ విచారణ అంశాన్ని వాపసు తీసుకునేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో తదుపరి సీబీఐ విచారణకు వీలు లేకుండాపోవడంతో తొలుత హైకోర్టులోను ఆ తర్వాత సుప్రీంకోర్టులోను సీబీఐ పిటిషన్లు దాఖలు చేసింది. ఇదే సమయంలోనే ఎమ్మెల్యే యత్నాళ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో డీకే సొంతూరు కనకపురలో యత్నాళ్‌పై పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇదే కేసును కనకపుర నుంచి బెంగళూరు కోర్టుకు బదిలీ చేయాలంటూ యత్నాళ్ కోర్టును విన్నవించారు. వీటన్నింటికంటే డీకే అక్రమాస్తుల కేసు విచారణ కొనసాగించేలా యత్నాళ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇలా ఇరువురి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి.

పహల్గాంలో ఉగ్రదాడి కేంద్రం తప్పిదమన్నారు

చిన్నస్వామి ఘటనపై కాంగ్రెస్ మౌనం: బీజేపీ ట్వీట్

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై దుర్మార్గానికి ఒడిగడితే, అందుకు కేంద్ర ప్రభుత్వ విఫలమైందంటూ మాట్లాడిన కాంగ్రెస్ ప్రముఖులు చిన్నస్వామి స్టేడియం సంఘటనపై మౌనం అంటూ బీజేపీ కర్ణాటక ఎక్స్ ద్వారా ప్రశ్నించింది. ఉగ్రవాదులు కాపుగాచి క్రూరంగా వ్యవహరిస్తుంటారని పహల్గాం దాడి జరిగినప్పుడు కాంగ్రెస్ నేతలు నిత్యం కేంద్రప్రభుత్వంపై ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముందుగా నిర్ణయించుకున్న సంబరాలకు వచ్చే ప్రజలను నియంత్రించలేకపోవడాన్ని ఏమంటారని నిలదీశారు. మంత్రులు సంతోష్‌లాడ్, ప్రియాంకఖర్గే ఎందుకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్‌కు చెందిన శతమూర్ఖులు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారని, కానీ ఆర్‌సీబీ సంబరాలను నిర్వహించేందుకు తగినంత సమయం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందన్నారు. వీరి నిర్లక్ష్యానికి అమాయకులు బలయ్యారని భద్రతా వైఫల్యాలపై కాంగ్రెస్ విధూషకులు పెదవివిప్పడం లేదు ఎందుకంటూ ఎద్దేవా చేశారు.



వరద నీటితో కళ సంతరించుకున్న తుంగభద్ర జలాశయం

తుంగభద్రకు వరద నీరు చేరిక

ఆయకట్టు రైతుల్లో హర్షం

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది తుంగభద్ర జలాశయానికి 15 రోజుల ముందు నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కొత్తనీటితో తుంగభద్ర జలాశయం జలకళను సంతరించుకుంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం పైభాగం పశ్చిమ కనుమల్లోని ఖుదరేముఖ, వరునాడు, అగుంబె తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగ, భద్ర జలాశయాలు నుంచి అధిక మొత్తంలో వరదనీరు వచ్చి చేరుతోంది. ఇప్పటి శివమొగ్గ జిల్లాలో ఉన్న తుంగ జలాశయం పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు వరద నీటిని వదులుతున్నారు. ఆ నీరంతా నేరుగా తుంగభద్ర జలాశయానికి వచ్చి చేరుతుండడంతో రోజు రోజుకూ తుంగభద్ర జలాశయంలో వదర నీటి చేరిక పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయం 1599.66 అడుగులకు నీరు చేరగా, సరాసరి 7,905 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 21.091 టీఎంసీల నీరు నిలువ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో కేవలం 517 క్యూసెక్కుల చేరుతుండగా, 3.05 టీఎంసీల నీరు నిలువ ఉండేదని జలాశయం అధికారులు తెలిపారు.

క్రస్ట్ గేట్ల పరిశీలనకు

కేంద్ర బృందం రాక

బళ్లారి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నీటి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ల పరిశీలనకు కేంద్ర జలవనరుల శాఖ క్రస్ట్ గేట్ల తయారీ నిపుణులు(ఈఅండ్ఎస్) అమిత్ రంజన్ నేతృత్వంలో బృందం వస్తున్నట్లు తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి తెలిపారు. తుంగభద్ర డ్యాంకు మొత్తం 33 గేట్లు ఉన్నాయి. ఉన్న అన్నీ గేట్లునూ మార్చి కొత్త గేట్లు అమర్చేందుకు రూ. 60 కోట్లుతో టెండర్ పిలిచారు. ఇందుకు గుజరాత్ రాష్ట్రం అహమ్మదాబాద్‌లో ఉన్న హార్డ్‌వేర్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ప్రస్తుతం డ్యాంకు ఉన్న గేట్లు వర్టికల్ డిజైన్‌లో ఉన్నాయి. నూతన సాంకేతికత ప్రకారం రేడియల్ గేట్లను అమర్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం 19వ గేటు అమర్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈనేపథ్యంలో కేంద్ర బృందం పరిశీలించనుంది. కొత్త గేట్లు ఏర్పాటుపై కూడా పరిశీలించనున్నట్లు సెక్రటరీలో తెలిపారు. 19వ గేటును మరో 15 రోజుల్లో అమరుస్తామని ఆయన తెలిపారు.



ఘనంగా తిరంగా యాత్ర

హెచ్ఎంటీ భూముల కోసం అరణ్య పోరాటం..!



హెచ్ఎంటీ భవనం

- మైసూరు చట్టం ద్వారా భూమి కేటాయింపు
- కొత్త చట్టానికి అనుగుణంగా చర్యలు
- సర్కారుకు వ్యతిరేకంగా అధికారులు
- రూ.14వేల కోట్ల విలువైన 443 ఎకరాలు

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల క్రితం ఎవరైనా హెచ్ఎంటీ వాచ్ కట్టారంటే అతడు పలుకుబడి కల్గినవారు, లేదా శ్రీమంతుడే ఉంటాడనే భావం ఉండేది. వరుడికి హెచ్ఎంటీ వాచ్ బహుమతిగా ఇచ్చామని వధువు కుటుంబీకులు గొప్పలు చెప్పుకొనేవారు. అంతటి పేరు కేవలం కర్ణాటకలోనే కాదు దక్షిణాదితోపాటు ఉత్తరభారత్‌లోని కొన్ని రాష్ట్రాలలో ఈ విధమైన ప్రచారం ఉండేది. అందుకు ప్రధాన కారణం దేశీయంగా ప్రత్యేకించి బెంగళూరులో కేంద్రప్రభుత్వం అనుబంధంగా హిందూస్థాన్ మిషన్ టూల్స్ (హెచ్ఎంటీ) కంపెనీలో వాచీలు తయారయ్యేవి. ఇలా ప్రాంతీయతత్వంతోపాటు లగ్జరీ అనిపించే ఎన్నో డిజైన్ల వాచీలు విద్యార్థులకు, యువతీ యువకులకే కాకుండా అన్ని వయస్సుల వారికి తయారయ్యేవి.

● అప్పట్లో హెచ్ఎంటీ ఫ్యాక్టరీకి 443 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ భూమిలో కొంతభాగాన్ని ప్రైవేట్‌గా విక్రయించారు. ప్రస్తుతం ఇదే వివాదమైంది. అటవీశాఖ తమ పరిధికి చెందిన భూమిని దక్కించుకునేందుకు పోరాటానికి సిద్ధమైంది. హెచ్ఎంటీకి ఇచ్చిన భూమిని తిరిగి తీసుకునేందుకు కారణకర్తలైన అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. అటవీశాఖలో 13మంది అధికారుల నివాసాలకు ఆపద కలిగించే పరిస్థితి ఏర్పడింది. ప్రధాన కార్యదర్శి హోదాతో సమానమైన అదనపు ముఖ్య ప్రధాన అటవీసంరక్షణాధికారిని సస్పెండ్‌చేసే స్థాయికి చేరింది. దీంతో ఈ వివాదానికి సంబంధించి ప్రముఖమైన ఫైల్ మాయమైంది.

● ప్రస్తుతం 14వేల కోట్ల రూపాయలకుగాపైగా విలువైన హెచ్ఎంటీ పరిధిలోని అటవీభూమిని డీ నోటిఫికేషన్ అనుమతి కోరుతూ సుప్రీంకోర్టు ఇంటర్ లాక్యుటరీ అప్లికేషన్ పిటిషన్ దాఖలు చేసిన మేరకు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులకు వ్యతిరేకంగా సిఫారసు చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా ఈఫైల్‌పై సంతకం చేసి చర్యలకు సూచించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ చర్యలపై ఐఎఫ్ఎస్, ఐఏఎస్ అధికారులలో అసంతృప్తి ఉన్నట్టు తెలుస్తోంది.

● హెచ్ఎంటీపాటు జీవీకేవీ సహా ఇతర సంస్థలకు అటవీభూమిని కేటాయించారు. అయితే హెచ్ఎంటీకి కేటాయించిన ప్రధానమైన ఫైల్ కనిపించకుండా పోయింది. సంతకాలు లేని కొన్ని కాగితాలు కనిపిస్తే ముఖ్యమైన రికార్డులు కనిపించకుండా పోయాయి. భూమికి సంబంధించి రిజిస్టర్ పత్రం ఉంది. అటవీభూమిని కేటాయించిన రికార్డు కీలకమైనది. కానీ అటవీచట్టం 1963లో జారీ చేసిన 1965 నుంచి అమలులోకి వచ్చింది. అంతకుముందు మైసూరు చట్టం సెక్షన్ 30 ప్రకారం భూమి ఇవ్వగా దీనికి సంబంధించిన రికార్డులు ప్రస్తుతం ప్రభత్వం వద్ద లేవు. ఇతర సంస్థలకు భూమిని కేటాయించిన రికార్డులు ఉన్నా, హెచ్ఎంటీకి సంబంధించిన రికార్డులు కనిపించకపోవడం వివాదం అవుతోంది. మైసూరు చట్టం ప్రకారం భూమిని కేటాయించారు.

● కొత్త చట్టం 1965 ప్రకారం అటవీభూమిని ఏ సంస్థకు కేటాయించినా అంతే విస్తీర్ణంలో భూమిని అటవీశాఖకు ఇవ్వాలనే నిబంధన ఉంది. మరోవైపు ఏ లక్ష్యం కోసం భూమిని కేటాయించారో ఆ సందర్భం, పరిస్థితి ముగిసిన వేళ, సదరు భూమిని అటవీశాఖకు అప్పగించాల్సి ఉంది. మైసూరు చట్టం ప్రకారం భూమిని కేటాయించారని చెబుతున్నా అక్కడి పరిస్థితులు, నిబంధనలు సూచించే పత్రాలే లేకుండాపోయాయి.

● అటవీశాఖ ప్రధానకార్యదర్శి స్థాయి అధికారిని సస్పెండ్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో అదే శాఖకు చెందిన ఇతర అధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వంపై ఇదో చెడు సందేశానికి కారణం కానుందని సీఎం సిద్దరామయ్యకు అటవీశాఖకు చెందిన సీనియర్ అధికారులు కొందరు వివరించినట్టు తెలుస్తోంది. ఇటీవల అటవీశాఖకు చెందిన పలువురు అధికారులతో సీఎం చర్చించిన వేళ సస్పెండ్ విషయాన్ని వారు ప్రస్తావించినట్టు తెలుస్తోంది.

● హెచ్ఎంటీ పరిధిలో అటవీశాఖ భూములు ఉన్నా ప్రస్తుతం అడవుల స్వరూపాన్ని పూర్తిగా కోల్పోయింది. అటవీభూమిని డీ నోటిఫికేషన్‌కు ఇంటర్ లాక్యూటరీ అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసిన అధికారిపై చర్యలకు ఒత్తిడి ఉంది. మంత్రివర్గ నుంచి అనుమతి పొందకుండానే డీ నోటిఫికేషన్ అర్జీ దాఖలు చేశారనేది తీవ్రమైనదిగా భావిస్తున్నారు. ఆ సందర్భంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మధ్యవర్తిత్వంతో అర్జీని సవరణలు చేసి మార్గదర్శకాలు చేసిన ఆధారాలు ఉన్నాయి. హెచ్ఎంటీ వద్ద ఉన్న అటవీభూమిని డీ నోటిఫికేషన్ అనుమతులు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మేరకు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు ఇద్దరు అధికారులపైనా చర్యలు తీసుకోదలిచారు. హెచ్ఎంటీ పరిధిలోని భూమిని అటవీయేతర ఉద్దేశానికి మార్పు జరిగింది. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, అటవీసంరక్షణా చట్టం ప్రకారం ఇప్పటికీ అది అటవీభూమిగా ఉందని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ భూమి పరులపాలు అవుతోందని రియల్ ఎస్టేట్ సంస్థలు వందలాది ప్లాట్‌లు వేశా యి. అటవీశాఖకు చెందిన 13మంది అధికారుల నివాసాలు కూడా అక్కడే ఉన్నాయి. ఇందుకు ఎలా అనుమతులు ఇచ్చారనేది ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. మంత్రివర్గ ని ర్ణయం తీసుకోకుండా, సుప్రీంకోర్టును ఆశ్రయించడం పాలకులకు తీవ్రమైన ఆగ్రహానికి కారణమవుతోంది. ప లుమార్లు అటవీశాఖ మంత్రి ఖండ్రె భూమిని దక్కించుకుంటామని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని శపథం చేశారు. తాజాగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ హె చ్ఎంటీకి కేటాయించిన భూముల్లో ప్రస్తుతం పరిశ్రమ లేనందున, ప్రభుత్వానికి చెందాల్సి ఉంటుందన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం: మంత్రి సవిత



ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తుకోసం పర్యావరణాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొంటున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి సవిత ఆధ్వర్యంలో గురువారం పెనుకొండలో 1500మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారన్నారు. ఆమేరకు కోటి మొక్కలు నాటి వాటికి జియోట్యాగింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో పచ్చదనం 30.5శాతం ఉందని దానిని 50శాతానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్కడైనా చెట్లు నరికితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్రీరాములు, ప్రసాద్, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, షౌకత్, మాధవనాయుడు, పోతిరెడ్డి, గుట్టూరు సూరీ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బడిలో బాల్య స్మృతులు

రాయలచెరువులో 1974-75 పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం



రాయలచెరువులో 1974-75 టెన్త్ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

యాడికి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అర్ధ శతాబ్దం గడిచినా, వారిలో కలిసి చదువుకున్న వారితో ఉన్న జ్ఞాపకాలు పోలేదు. వృద్ధులైన చిన్న నాటి అనుబంధం మరచిపోలేదు. అందుకే మళ్లీ ఒకసారి వారంతా తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ అపూర్వ సమ్మేళనానికి మండలంలోని రాయలచెరువు హైస్కూల్ వేదికైంది. ఈ పాఠశాలలో 1974-75 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి విద్యార్థులు 25 మంది హాజరయ్యారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. ఇది తమ జీవితంలో మర్చిపోలేనిరోజు అని తెలిపారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు విశ్వనాథ్, శివప్రసాద్, సత్య శ్రీనివాసులు, రంగా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు 2025 సంవత్సరానికి సంబంధించి సీసీఎస్ ద్వారా అందించే ఆర్థికసాయం (వృద్ధాప్య సాయం) కోసం ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. సీసీఎస్‌లో కనీసం ఐదేళ్ల సర్వీసు కలిగి, 63 సంవత్సరాలు నిండినవారు అర్హులన్నారు. ఆర్టీసీ భద్రతా పథకంలో సభ్యులుగా ఉన్నవారు అనర్హులు అని తెలిపారు. ఆసక్తి, అర్హతగలవారికోసం అనంతపురం డిపో వద్ద దరఖాస్తు ఫాంలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9985431084 నంబరులో సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

కవితల పోటీకి ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీలకు జిల్లాలోని కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మీనాక్షమ్మ ఫౌండేషన్ కార్యాలయంలో కవితల పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. టీవీ రెడ్డి మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనదలచిన కవులు 'ఆర్డీటీ సేవలు-అభాగ్యులకు వరాలు' అనే అంశంపై కవితలు పంపాల్సుంటుందన్నారు. ఈనెల 10వ తేదీ రాత్రి 10గంటలలోపు 73828 63523 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. పోటీలకు వచ్చిన కవితల్లో న్యాయనిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవికాంత్ రమణ, తోట నాగరాజు, ఆశ్రయ కృష్ణారెడ్డి, లింగాల పవన్ పాల్గొన్నారు.

బాలికల హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జూనియర్ బాలికల హాకీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ హాకీ బాలికల జట్టును ఎంపికచేశారు. జట్టు వివరాలను గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో హాకీ అనంతపురం కార్యదర్శి అనిల్‌కుమార్ ప్రకటించారు. జట్టులో వర్షిణి, స్వీటీ, మంజుష, భావన, మనోజ్ఞ, భానుతేజ, శాలిని, మిరాంబీ, మైథిలి, అక్షయ, శృతి, సాయిభవ్య, జ్యోతి, కావ్య, అర్చన, లక్ష్మి, మహేశ్వరి, లహరి చోటు దక్కించుకున్నారన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు భీమవరంలో నిర్వహించే నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ శంకర్, సహాయ కార్యదర్శి అక్రంబాషా పాల్గొన్నారు.

మరొకరికి కరోనా

జిల్లాలో రెండుకు చేరిన కేసులు



అనంతపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో కొవిడ్ కేసు నమోదైంది. పెద్దవడుగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 49 ఏళ్ల వ్యక్తికి గురువారం పాజిటివ్ వచ్చింది. బాధితుడు కర్నూలులో చికిత్స పొందుతున్నాడు. అనంతపురం పాతూరుకు చెందిన ఓ మహిళకు బుధవారం పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. కొవిడ్ నిర్ధారణ అయిన వ్యక్తి శ్వాసకోశ సమస్యతో వారం క్రితం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ కొవిడ్ పరీక్షలు చేయగా, పాజిటివ్ అని తేలినట్లు డాక్టర్లు ప్రకటించారు. దీంతో జిల్లాలో కొవిడ్ బాధితుల సంఖ్య రెండుకు చేరింది. ఈ వేరియంట్ ప్రమాదకారి కాదని, అయితే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రమోషన్‌లు వద్దా..?

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు స్పందన కరువు ● 382 ఖాళీలకు 373 మంది టీచర్ల హాజరు

అనంతపురం విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు సెకెండరీ గ్రేడ్ టీచర్లలో ఆసక్తి కనిపించడం లేదు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎస్‌జీటీల నుంచి స్పందన కరువైంది. ఖాళీల కంటే హాజరైన వారు తక్కువగా ఉండటం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వ, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల పరిధిలో 382 స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులంను భర్తీ చేసేందుకు అర్హులైన ఎస్‌జీటీలకు గురువారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. మూడు విభాగాల వారికి వేర్వేరు గదుల్లో వెరిఫికేషన్ నిర్వహించారు. కానీ ఆశించిన స్థాయిలో ఎస్‌జీటీలు రాలేదు. అధికారులు ఇచ్చిన గణాంకాల మేరకు ప్రభుత్వ యాజమాన్యంలో 26 పోస్టులకు 21 మంది, మున్సిపాలిటీల్లో 304 పోస్టులకు 300 మంది, మున్సిపల్ కార్పొరేషన్‌లో 52 పోస్టులకు 52 మంది వచ్చారు. 382 మందికి ప్రమోషన్లు ఇస్తామంటే 373 మంది మాత్రమే వెరిఫికేషన్‌కు రావడం గమనార్హం. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున (1:2) పిలిస్తే.. కనీసం ఒక పోస్టుకు ఒక్కరు కూడా రాలేదు. గైర్హాజరైనవారికి శుక్రవారం కూడా వెరిఫికేషన్‌కు అవకాశం ఉంటుందని సమాచారం.

నేడు జడ్పీ మేనేజ్‌మెంట్ వారికి..

జడ్పీ యాజమాన్య పాఠశాలల ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించేందుకు శుక్రవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. జడ్పీ యాజమాన్యం కింద సుమారు 350 పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వనున్నారు. అర్హులైన ఎస్‌జీటీలను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు.





సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు, హాజరైన టీచర్లు

ఇంకా రాలేదేం..?

బదిలీ ఉత్తర్వుల కోసం స్కూల్ అసిస్టెంట్ల నిరీక్షణ

అర్ధరాత్రి వరకూ జారీకాని ఉత్తర్వులు

కోరుకున్న చోటు దక్కుతుందో.. లేదోనని గుబులు

బదిలీలకు దరఖాస్తు చేసినవారు 4,589 మంది

అనంతపురం విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వుల కోసం స్కూల్ అసిస్టెంట్లు ఎదురుచూస్తున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఇప్పుడొస్తుంది.. అప్పుడొస్తుంది అని ఉత్తర్వుల కోసం వేచి చూశారు. చాలామంది హైరానా పడుతూ కనిపించారు. కంపల్సరీ, రిక్వెస్ట్ కింద 4,589 మంది టీచర్లను బదిలీ చేశారు. వీరందరికీ ఉత్తర్వులు అందాల్సి ఉంది. బదిలీల కోసం స్కూల్ అసిస్టెంట్ల రాత్రిళ్లు కళ్లలో ఒత్తులు వేసుకుని మరీ పనిచేశారు. గంటల తరబడి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ముందు కూర్చొని అప్షన్లు పెట్టారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రంలోపు ఆర్డర్లు వస్తాని ఆశించారు. కానీ ఉత్తర్వుల గురించి జిల్లా అధికారుల వద్ద కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఉపాధ్యాయులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కోరుకున్న పాఠశాల దక్కుతుందా..? ఏ పాఠశాలకు బదిలీ చేస్తారు..? ఎంత దూరంలో ఉంటుందో..! అని చర్చించుకున్నారు. రాత్రి 12 గంటల వరకూ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు పలువురు ఫోన్ చేసి ఆరా తీశారు. సర్వర్ సమస్య కారణంగా ఉత్తర్వులు ఆలస్యమౌతాయని తెలిసింది.

బదిలీలకు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయులు

సబ్జెక్టు	రిక్వెస్టు	కంపల్సరీ	మొత్తం
బయాలజీ	217	414	631
ఇంగ్లిష్	245	411	656
హిందీ	253	130	383
కన్నడ	3	0	3
గణితం	357	490	847
ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ)	173	89	262
ఫిజికల్ సైన్స్	187	429	616
సంస్కృతం	3	4	7
సోషల్	279	265	544
స్పెషల్ ఎడ్యుకేషన్	37	0	37
తెలుగు	371	213	584
ఉర్దూ	8	11	19
మొత్తం	2,133	2,456	4,589

షైనింగ్ స్టార్స్ 222 మంది

టెన్త్‌లో 187, ఇంటర్‌లో 35 మంది ప్రతిభావంతులు

9న ఆర్ట్స్ కాలేజీలో సత్కారం.. రూ.20 వేల బహుమతి



అనంతపురం విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా గుర్తించి, నగదు ప్రోత్సాహకంతో సన్మానించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా 222 మంది విద్యార్థులను రాష్ట్ర అధికారులు షైనింగ్ స్టార్స్‌గా (ప్రతిభా అవార్డులు-2025) ఎంపిక చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల ప్రోత్సాహక నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందిస్తారు. స్టార్స్‌గా ఎంపికైన టెన్త్, ఇంటర్ విద్యార్థులను ఈ నెల 9వ తేదీన ఆర్ట్స్ కాలేజీలో అధికారులు సత్కరిస్తారు.

పది విద్యార్థులు 187 మంది..

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 187 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా ఎంపిక చేశారు. అనంతపురం మండలంలో 10 మంది, రాప్తాడు, తాడిపత్రి మండలాల్లో 9 మంది చొప్పున, గార్లదిన్నెలో 8 మంది, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, పామిడి మండలాల్లో ఏడుగురు చొప్పున, గుత్తి, గుంతకల్లు, కంబదూరు, నార్పల, పుట్లూరు, రాయదుర్గం, శింగనమల, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి మండలాల్లో ఆరుగురు చొప్పున, ఆత్మకూరు, బెళుగుప్ప, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, కుందుర్పి, పెద్దపప్పూరు, శెట్టూరు, వజ్రకరూరు, యల్లనూరు మండలాల్లో ఐదుగురు చొప్పున, కూడేరు మండలంలో నలుగురు, బ్రహ్మసముద్రం మండలంలో ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు.

ఇంటర్‌లో 35 మంది..

ఇంటర్ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించిన 35 మందిని స్టార్స్‌గా ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, కేజీబీవీ, ప్రైవేట్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాసంస్థల్లో చదువుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల్లో టాప్ మార్కులు సాధించిన 35 మందిని సత్కరించనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సత్కారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

ఉత్తమ మార్కులు సాధించిన వారిని షైనింగ్ స్టార్స్‌గా ఎంపిక చేసి, సన్మానించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 9వ తేదీ అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లో వేడుకను ఘనంగా నిర్వహిస్తాం. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం మొదలౌతుంది. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు హాజరుకావాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకకు ఉపాధ్యాయులు, ప్రజలు సహకరించాలి.

-ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను గురువారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు విడుదల చేశారు. ఆయన మట్లాడుతూ.. ఏప్రిల్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్23) రెగ్యులర్‌తో పాటు (ఆర్15, 19, 20) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్15, 19, 20, 23) సప్లిమెంటరీ నిర్వహించామన్నారు. విద్యార్థులు ఫలితాలకోసం www.jntuarsults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

గంటన్నర ముందే కేంద్రానికి చేరాలి

అనంతపురం విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్స్‌లో పరీక్షలు ఉంటాయి. ఈ నెల 30వ తేదీ వరకూ పరీక్షలు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో 8, బెంగళూరులో 2 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అనంతపురం, సమీప మండలాల్లోని పీవీకేకే (8442), ఎస్ఆర్ఐటీ (సెంటర్ కోడ్ 1848), అనంత లక్ష్మి(1870), ఎస్‌వీఐటీ (2717), నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ స్కూల్ యాక్షన్ ఆఫ్ ఇండియా (37512), గుత్తి గేట్స్ కాలేజీ (2181), తాడిపత్రిలో సీవీ రామన్ (29025), పుట్టపర్తిలోని సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(8936), బెంగళూరులోని బిట్‌బైట్ టెక్ సొల్యూషన్స్(35699), టెక్ చాలెంజ్ డిజిటల్ సొల్యూషన్స్(40071) సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 10 కేంద్రాలకు 45,816 మంది అభ్యర్థులను కేటాయించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తమ వెంట తీసుకెళ్లరాదు.

13న అనంతలో మెగా జాబ్‌మేళా

అనంతపురం అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో 13న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటలదాకా జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 50కిపైగా నేషనల్, మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, పీజీ చదివిన వారు తగిన సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌కు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. మీ ప్రొఫైల్ లాగిన్ అయ్యి అన్ని కంపెనీలకు దరఖాస్తు చేసుకొని, అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9010039901, 8341366022, 9490682810ను సంప్రదించాలన్నారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి


పెద్దవడుగూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామంలో గురువారం ఇంటి సమీపంలో ఉన్న నీటితొట్టెలో పడి చరణ్‌దీప్ (3) మృతి చెందాడు. బాలుడిని బయట వదిలి తల్లి అరుణ ఇంట్లోకి వెళ్లింది. బాలుడు ఆడుకుంటూ వెళ్లి సమీపంలో ఉన్న నీటి తొ ట్టెలో పడి ఊపిరి ఆడక మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన తల్లి అరుణ కుమారుడికి కోసం వెదికింది. చివరకు నీటితొట్టెలో అచేతనంగా పడి ఉన్న కుమారుడిని గుర్తించి, బయటకు తీసింది. అప్పటికే బాలుడు మృతిచెంది ఉండటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృత్యువాత

గుత్తి, జూన్5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రోడ్డు ప్రమాదంలో గొల్ల కార్తీక్ (30) మరణించగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. యాడికి మండలం కొట్టాలపల్లికి చెందిన కార్తీక్.. తన ఊరికే చెందిన స్నేహితుడు శ్రీనివాసరెడ్డితో కలిసి గుత్తిలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ప ట్టణ పరిధి తాడిపత్రి రోడ్డులో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనా న్ని ఢీకొట్టారు. బైక్ నుంచి కార్తీక్ కిందపడగానే వెనుక వైపు వ స్తున్న లారీ అతడి తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరెడ్డి గాయపడ్డాడు. మరో బైక్‌లో వస్తున్న యాడికికి చెందిన బషీర్, రమేష్ కూడా గాయపడ్డారు.

అప్పుడేమయ్యారు..?

- 2021లోనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రద్దు
- ప్రజాప్రతినిధులుగా అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదు?
- ఆర్డీటీ సమస్యకు రాజకీయ ముద్ర వేసి భ్రష్టు పట్టిస్తున్నారు
- పాదయాత్ర ఢిల్లీలో చేస్తే మంచిది
- మాజీ ఎంపీ తలారి రంగయ్యపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని ఫైర్



అనంతపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నపుడే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రద్దయిందనీ, ప్రజాప్రతినిధులుగా అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని మాజీ ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రశ్నించారు. ఆర్డీటీ సమస్యకు రాజకీయ ముద్ర వేసి భ్రష్టుపటిస్తున్నారని రంగయ్య వ్యవహార శైలిపై మండిపడ్డారు. పాదయాత్ర ఢిల్లీలో చేస్తే మంచిదని హితవు పలికారు. గురువారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఎమ్మెల్యే అమిలినేని మీడియాతో మాట్లాడారు. 2021లో ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రద్దు చేశారన్నారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉందన్నారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలుగా తలారి రంగయ్య, ఉషశ్రీచరణ్, ఇతర నేతలు అప్పట్లో ఎఫ్‌సీఆర్ఏ రద్దు గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎఫ్‌సీఆర్ఏ రద్దు అయ్యిందన్న భావన కల్పించేలా రకరకాలుగా వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీటీని ప్రజాప్రతినిధులు, మేధావులు, అన్నివర్గాల ప్రజలు కలిసికట్టుగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేసేలా చొరవ చూపాలని కోరామన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చారన్నారు. అది ప్రాసెస్‌లో ఉందని ఇటీవల సీఎం చంద్రబాబు చెప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆర్డీటీ సమస్యను పరిష్కరించేందుకు సీఎం, మంత్రులతో చర్చించి, అఖిలపక్షం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌పై కేంద్ర హోం శాఖ మంత్రికి తాను లేఖ రాశాననీ, ఆయన సమాధానం పంపారన్నారు. తాము ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామన్నారు. ఇంతవరకు తన నియోజకవర్గంలో ఏ ఒక్కరోజూ ఇతర పార్టీ నాయకుల కార్యక్రమాలను అడ్డుకోవడంగానీ, గొడవలు చేయడంగానీ చేయలేదన్నారు. జగన్‌రెడ్డి నిర్బంధ విధానాల కారణంగానే ఆ పార్టీ 11 సీట్లకే పరిమితమైందన్న విషయాన్ని పాదయాత్ర చేసేవారు గుర్తుపెట్టుకుంటే మంచిదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి నిర్వీర్యమైందన్నారు. ఇప్పట్లో కోలుకోవడం కష్టమని ఇతర రాష్ట్రాల నాయకులు భావించారన్నారు. నిర్వీర్యమైన వ్యవస్థలను విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు చక్కబెట్టడం చూసి ఆయనను అభినందిస్తున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రప్పించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి ప్రజలతోపాటు సొంత చెల్లి, తల్లి, కుటుంబ సభ్యులను మోసం చేశారన్నారు.

నేడు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

అనంతపురం అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలం మైనార్టీ కాలనీలోని వెలుగు కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహికులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై వివరిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ఆధార్ కార్డు, మొబైల్, పాన్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాసిన్‌కి వచ్చిన కేంద్ర మంత్రి





స్వాగతం పలుకుతున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

గోరంట్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం వద్దగల నాసిన్ అకాడమీకి కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం విచ్చేశారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఆమె ఢిల్లీ నుంచి బయల్దేరి బెంగళూరు విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి బయల్దేరి రాత్రి 8.30గంటలకు నాసిన్ అకాడమీకి చేరుకున్నారు. ఆమెకు జిల్లా కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న స్వాగతం పలికారు. తర్వాత మంత్రి నాసిన్ అకాడమీలోనే రాత్రి బస చేశారు. శుక్రవారం కేంద్రమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. కేంద్రమంత్రితో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖమంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శె. శంకరనారాయణ కాంప్...

డాక్టర్ మాస్తి వెంకటేశ అయ్యంగార్ (జయంతి, వర్ధంతి)



ప్రముఖ కన్నడ రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత మాస్తి వెంకటేశ అయ్యంగార్ 1891 జూన్ 6న కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా మాలూరు తాలూకా మాస్తి గ్రామంలో జన్మించారు. చిన్నకథల రచనలో ప్రసిద్ధులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, మైసూరు రాజుతో సత్కారం అందుకున్నారు. 'శ్రీనివాస' కలం పేరిట రచనలు చేశారు. 'మాస్తి కన్నడద ఆస్తి' (మాస్తి కన్నడకు ఆస్తి) అనే సూక్తి బహుళ ప్రచారం పొందింది. 123కుపైగా కన్నడ పుస్తకాలు, 17 ఆంగ్ల పుస్తకాలు రచించారు. 1986 జూన్ 6న కన్నుమూశారు. ఇలా జయంతి, వర్ధంతి ఒకే తేదీన రావడం కాకతాళీయం.

సునీల్‌దత్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సునీల్‌దత్ 1929 జూన్ 6న జన్మించారు. అసలుపేరు బాల్‌రాజ్ దత్. హిందీ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు. కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోనూ సత్తాచాటారు. 1957లో 'మదర్ ఇండియా' సినిమాతో పేరొందారు. బాంబే షెరిఫ్‌గా వ్యవహరించారు. అనంతరం బాంబే నార్త్‌వెస్ట్ నుంచి ఐదు సార్లు ఎంపీగా గెలుపొందారు. 2004-05 మధ్యన కేంద్ర క్రీడలు, యువజనుల శాఖ మంత్రిగా వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల సినీ సేవలకు ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు పొందారు. 2005 మే 25న కన్నుమూశారు. కాగా ఆయన కుమారుడు సంజయ్‌దత్ కూడా నటుడిగా పేరొందారు.

డి. రామానాయుడు (జయంతి)



తెలుగు సినీ నిర్మాత, 'పద్మభూషణ్' గ్రహీత దగ్గుబాటి రామానాయుడు 1936 జూన్ 6న ప్రకాశం జిల్లా కారంచేడులో జన్మించారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థాపకులు. ల్యాబ్, రికార్డింగ్ సదుపాయాలు, డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్, పోస్టర్స్ ప్రింటింగ్, గ్రాఫిక్ యూనిట్ ఇలా అన్ని విభాగాలు ఉండడం ప్రత్యేకత. నిర్మాతగానే కా కొన్ని సినిమాలలో కూడా ప్రత్యేక పాత్రలలో నటించి మెప్పించారు. దాదా సాహెబ్ ఫాల్కే, రఘుపతి వెంకయ్య అవార్డు, ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. 1991లో స్వచ్ఛందసంస్థ ఏర్పాటు చేసి సమాజసేవ చేశారు. 13 భారతీయ భాషలలో 150కుపైగా సినిమాలు తీసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గుంటూరు జిల్లా బాపట్ల నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2015 ఫిబ్రవరి 18న కన్నుమూశారు.

వీరభద్రరావు (జయంతి)



సుత్తి వీరభద్రరావుగా పేరొందిన మామిడిపల్లి వీరభద్రరావు 1947 జూన్ 6న తూర్పుగోదావరి జిల్లాలో జన్మించారు. తెలుగులో పేరొందిన కమెడియన్‌గా, క్యారెక్టర్ నటుడిగాను పేరొందారు. 1970, 80లలో రేడియో, నాటకాలలో రాణించారు. విజయవాడ రేడియోకేంద్రంగా ఎన్నో నాటకాలలో పాల్గొన్నారు. 'నాలుగు స్తంభాలాట' సినిమాతో ఎంతో పేరొందారు. దర్శకుడు జంధ్యాల గారి సినీబృందంలో ఒకరు. 200కుపైగా సినిమాలలో నటించారు. తెలుగు నాటకాలకు సంబంధించి ఆయన సొంతంగా ప్రైవేట్ లైబ్రరీని కలిగి ఉండడం సాహిత్యంపై ఆయన అభిమానం తెలుస్తోంది. 41వ యేట 1988 జూన్ 30న కన్నుమూశారు.

అజింక్య రహానె (పుట్టినరోజు)



అజింక్య మధుకర్ రహానె 1988 జూన్ 6న మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో జన్మించారు. టెస్ట్ క్రికెట్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ముంబైలోని రంజీ ట్రోఫీకి కెప్టెన్‌గా ఉన్నారు. అలాగే ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్నారు. రైట్ హ్యాండెడ్ బ్యాట్స్‌మన్, ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ప్రత్యేకం. ఆయన సారథ్యంలో ఆస్ట్రేలియాలో 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఇండియా కైవశం చేసుకుంది. 2020లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా 'ముల్లా మెడల్ అందుకున్న తొలి క్రికెటర్. 2023 ఐపీఎల్ ఎడిషన్‌లో సీఎస్‌కే జట్టు తరఫున రాణించారు. బెస్ట్ ఇండియాస్ ఓవర్సీస్ ప్లేయర్‌లో ఒకరిగా నిలిచారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి



విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న సుజాత సత్తప్ప రాజశేఖర్

కంప్లి, జూన్5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప కోరారు. గురువారం కుడితిని పట్టణ పంచాయతీ ప్రాంగణంలో విద్యార్థులకు ల్యాప్‌టాప్ పంపిణీ కార్యక్రమంలో చేపట్టారు. ఎస్‌ఎఫ్‌సీ నిధుల కింద ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఐదు ల్యాప్‌టాప్‌లు, దివ్యాంగులు ముగ్గురికి త్రిచక్ర స్కూటర్లు పంపిణీ చేశారు. స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ తాము గతంలో పేద విద్యార్థులకు సహాయంతోపాటు చదువు కోసం కావలసిన పరికరాలు అందించామన్నారు. పేద విద్యార్థులు విద్యాభ్యాసంలో వెనుకంజ వేయవద్దని, ఏ సహాయ సహకారాలు కావాలన్నా నేరుగా తనను సంప్రదిస్తే ఆదుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా పాఠశాలలో చేర్చి విద్యాభ్యాసం చేయించాలన్నారు. కార్యక్రమంలో స్థాయి సమితి అధ్యక్షులు సీవో తీర్థప్రసాద్, రాజశేఖర్, కౌన్సిలర్ మంజునాథ, వెంకటరమణ బాబు, దుగ్గెప్ప, విఠోబా దేవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



జానకి ఫ్యాక్టరీ ఆవరణలో మొక్క నాటుతున్న మేనేజర్ అన్వర్‌బాషా

బళ్లారిరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ పరిధిలోని సిడిగినమల గ్రామ సమీపంలో జానకి ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆవరణలో సీనియర్ జనరల్ మేనేజర్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించడంసాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటడం వల్ల మంచి వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, నాగ శంకర్, అబ్దుల్ ఖాసీం, జడే స్వామి, సాంబశివరావు వన్నూరప్ప, రామ్‌సింగ్ యాదవ్, బిర్లా, మాజీ సైనికుడు ప్రహల్లాద పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తాలుకాలోని రూపనగుడి గ్రామంలో పంచాయతీ అధ్యక్షులు మల్లయ్య, మాజీ అధ్యక్షులు నాగరాజు మొక్కలునాటారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల వాతావరణం అనుకూలంతో వుండటంతో పుష్కలంగా వర్షాలు కురుస్తాయన్నారు. పంచాయతీ సభ్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రూపనగుడి గ్రామంలో మొక్క నాటుతున్న నాగరాజు, మల్లయ్య

బళ్లారి సిటీ: పర్యావరణాన్ని కాపాడటం అందరిన బాధ్యత అని నారాయణ ఈ టెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ రజని అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగర హృదయ భాగంలో ఉన్న కనకదుర్గమ్మ సర్కిల్‌లో విద్యార్థులచే నృత్యరూపకం ద్వారా పరిసర జాగృతి కల్పించారు. 100కు పైబడి మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్

తోరణగల్లు: నియోజకవర్గంలో ఈనెలాఖరులోగా 60 వేల మొక్కలు నాటాలని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అధికారులకు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సండూరు తాలుకా నిడుగుర్తి గ్రామంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అలాగే చిన్నస్వామి స్టేడియంలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ వివిధ శాఖల అధికారులు మడిగిన బసప్ప, హనుమప్ప, ఆర్‌ఎఫ్‌వో ఖలందర్ బాషా, రేణుకాచార్య పంచాయతీ అధ్యక్షులు కాలమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిరుగుప్ప: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యంగా ఉంటారని సివిల్ న్యాయాధికారి అశోక్ అన్నారు. గురువారం సిరుగుప్ప పట్టణం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ కళాశాలలో అటవీశాఖ తాలుకా పరిపాలన ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. న్యాయాధికారి మొక్కలకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటడం వల్ల పరిసరాలు పచ్చదనంతో నిండుతాయన్నారు. ఉత్తమ పరిసరాలతో మనుషులు ఉత్తమ ఆరోగ్యం పొందుతారన్నారు. తహసీల్దార్ నరసప్ప, డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థ, అటవీశాఖ అధికారి రాజా అంబన్న, సోషల్ ఫారెస్టు అధికారి రాఘవేంద్ర, న్యాయవాదులు పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి అశోక్

కంప్లి: గ్రామాల్లో ప్రజలు తమ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కుడితిని గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే సిరిగేరి ప్రభుత్వ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు మొక్కలు నాటారు. తాళూరు ప్రభుత్వ హైస్కూలు పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వినోద్, ప్రధానోపాధ్యాయులురాలు గీత, మహమ్మద్ ఖాదిర్, పురుషోత్తమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



కుడితిని గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్క నాటుతున్న యువకులు

ప్రమాదంపై రాజకీయం తగదు

● ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ హితవు

రాయచూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది దుర్మరణం పాలు కావడం అత్యంత బాధాకరమని చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. ఈ విషయంలో బీజేపీ చేస్తున్న రాజకీయం తగదని, ఈ వివాదాన్ని దురదృష్టకర సంఘటనగా పరిగణించాలని హితవు పలికారు. మంత్రి ఎన్.ఎస్.భోసరాజు జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్యే బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు తగిన సమయంలో సమాధానం చెబుతామన్నారు. విజయోత్సవ సభ నిర్వహణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిందని, ఊహించనిదానికంటే జనం ఎక్కువగా రావడం వల్లే తొక్కిసలాట చోటు చేసుకుందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఇప్పటికే నివారణ చర్యలు చేపట్టిందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ ఖర్చుతోనే వైద్యం అందిస్తున్నామని ఈ విషయంలో ఇతరులతో సలహాలు చెప్పించుకునే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. బీజేపీ నాయకులు దురదృష్టకరమైన సంఘటనపై రాజకీయ ప్రయోజనం పొందేందుకు చేస్తున్న వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేవిగా ఉన్నాయన్నారు. ఈ విషయంలో బీజేపీ సీనియర్ నాయకుడు సీటీ రవి చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు తగిన సమయంలో జవాబు ఇస్తానని ఎమ్మెల్యే అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

కుమారుడిని కాటేసిన పామును

అడవిలో వదిలిన కుటుంబం



పాముకాటుతో మృతిచెందిన బాలుడు(ఫైల్), అదే పామును పట్టించిన కుటుంబీకులు

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పామును చూస్తే భయపడి మళ్లీ ఇదే ప్రాంతానికి వస్తుందనే కారణంతో చంపేస్తుంటారు. బెళగావి జిల్లాలో కన్నకుమారుడిని కాటేసి చంపిన పామును పట్టించి అడవిలో వదిలిపెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెళగావి జిల్లా తెలసంగ సమీపంలోని కకమరి గ్రామం పూరిపాకలాంటి ఇంట్లో మేనెల 31న అమిత్ గురులింగ సింధూర(10) ఇంట్లో మొబైల్ చూసుకుంటూ నిద్రించాడు. ఇంట్లోకి వచ్చిన పాము బాలుడి చేతికి కాటేసింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్సలు ఫలించక అమిత్ మృతి చెందాడు. పాము ఇంట్లోనే ఉండిపోయింది. బాలుడి అంత్యక్రియలు జరిపిన తర్వాత పాములు పట్టేవారిని పిలిపించి పట్టుకున్నారు. చంపేయకుండా అడవిలో వదిలివేయాలని సూచించారు. బాలుడిని కాటేసిన పామును సాధారణంగా ఎవరైనా అయితే ప్రతీకారంతో చంపేసేవారు. కానీ అడవిలో వదిలిపెట్టించడం సర్వత్రా ప్రశంసలకు కారణమైంది.

తాగునీరు కలుషితం కానివ్వకండి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే

రాయచూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత శాఖ అధికారులు తగిన జాగ్రతలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. శుద్ధీకరణ ప్లాంట్‌లు ఉన్నచోట వాటి పనితీరుపై నిఘా ఉంచాలన్నారు. అదే సమయంలో ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అవి త్వరితగతిన పనిచేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గురువారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మహాత్మ గాంధి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి అడ్‌హక్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన పనులు, వాటి పురోగతి టాస్క్‌ఫోర్స్ సమితి గుర్తించిన కార్యక్రమాల వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. అదే సమయంలో తాలూకాల వారిగా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి పనుల పరిశీలన జరపాలన్నారు. 2024-25 సంవత్సరంలో చేపట్టిన నరేగా పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ ఇప్పటికే ప్రారంభమైందని, దాంతో పాటే 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనుల వివరాల నివేదికలు అందించాలన్నారు.



పనుల వివరాలను తెలుసుకుంటున్న జడ్పీ సీఈఓ

ప్లాస్టిక్ రహిత జీవనం సాగిద్దాం



పర్యావరణంపై వివరిస్తున్న వ్యవస్థాపకుడు కృష్ణప్ప, ఉపాధ్యాయులు

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెను ప్రమాదకరమైన ప్లాస్టిక్ రహిత జీవనం సాగిద్దామని సెయింట్ ఫ్లవర్ పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ జీఆర్ కృష్ణప్ప అన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణకు మేలు చేస్తే భవిష్యత్తులో సంపూర్ణంగా ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటాలని ఇళ్ల పరిసరాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఆయన సూచించారు. ప్రతి రోజూ ఇంటికి ఎన్నోవిధాలుగా ప్లాస్టిక్‌ను తీసుకువస్తున్నామని, వాటిని నియంత్రించాలన్నారు. మార్కెట్‌లో సరుకుల కొనుగోలుకు చేతిసంచులు తీసుకెళ్లాలన్నారు. ప్రిన్సిపాల్ సౌమ్యతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అక్క కేఫ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అక్క కేఫ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ గురువారం భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం అమలులోకి రావాలంటే వైద్యాధికారుల కృషి ఎంతో అవసరమని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ బసవరాజు, నగర ప్రభుత్వా స్పత్రి చీఫ్ వైద్యులు డాక్టర్ వివేకానంద, డాక్టర్ ప్రశాంత్‌కుమార్, ఎమ్మెల్యే కార్యదర్శి గణేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్యాల సాధన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

రాయచూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానానికి తోడు పట్టుదల, ఏకాగ్రత ఉండి కఠోర పరిశ్రమ చేయడంతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. రాష్ట్ర చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు 79వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని రంగమందిరంలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో ఎదురైయ్యే సమస్యలను, సవాళ్లను అధిగమించేందుకు మానసికంగా సంసిద్ధులై ఉండాలన్నారు. సమావేశానికి స్థానిక కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య స్వామి సారథ్యం వహించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

హిందూపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజాప్రతినిధులు నాయకులు పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఎంపికైన వ్యవసాయ కమిటి ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, పాలకవర్గం గురువారం 10.56 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అశ్వత్థరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద మార్కెట్ యార్డ్‌కి ఛైర్మన్‌గా చేయడంతో ఎమ్మెల్యేకి రుణపడి ఉంటానన్నారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని వ్యాపారుల ఇబ్బందులపై ఎప్పటికప్పుడు స్పందిస్తానన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన సామాన్య కార్యకర్తలకు ఎమ్మెల్యే బాలకృష్ణ మంచి పదవులు ఇస్తున్నారన్నారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పిఏ వీరయ్య మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి, వ్యాపారులకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ టీడీపీ క్రమశిక్షణకు మారుపేరని, పార్టీలో కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తలకు మంచి పదవులు ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు అశ్వర్థరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాము, మంజునాథ్, అరుణాచల్‌రెడ్డి, పరిమళ, రామాంజినమ్మ, సతీష్, నారాయణరెడ్డి, ఆదినారాయణ, హనుమంతు, శంకర్, చిక్కీరప్ప, సిద్దగంగ, జనసేన నాయకులు చిన్న ప్రవీణ్, బీజేపీ నాయకుడు ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.66	1,577.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,905	517
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	246	5
నీటి నిల్వ (టీఎంసీలు)	21.09	3.50

నిషేధిత ప్లాస్టిక్ సీజ్



ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసిన కార్పొరేషన్ అధికారులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధ, గురువారాల్లో కార్పొరేషన్ అధికారులు పెద్దమార్కెట్, చిన్నమార్కెట్ ప్రాంతాల్లో ఇళ్లలో నిలువ ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ కవర్లను కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. గతంలో ఎన్నోమార్లు ప్లాస్టిక్ కవర్లు తయారు చేయరాదని నగర శివారు ప్రాంతంలో పారిశ్రామిక వాడలో ఉన్న ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. అయితే ప్లాస్టిక్ కవర్లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని పెద్దఎత్తున నిలువ చేసినట్లు సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉంచిన సంచులు స్వాధీనం చేసుకున్నారు. హెల్త్ ఆఫీసర్ కుమార స్వామితో పాటు కార్పొరేషన్ ఎన్విరాన్‌మెంటల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవులు, ఒంటెల రవాణా నిషిద్ధం

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బక్రీదు పండగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా గోవులు, ఒంటెలు రవాణా, వధలను నిషేధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అనధీకృతంగా ఒంటెలు, ఆవుల వధను నిషేధించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బక్రీదు పండుగ ఆచరణలో ఒంటెలు, ఆవుల వధను నిషేధించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టులు, పశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు శాఖ, ఆర్టీవో శాఖ అధికారులు అక్రమ రవాణాలను అరికట్టడంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమంగా గోవులు, ఒంటెలు రవాణా చేస్తుంటే వెంటనే పశు సంక్షేమ శాఖకు 08392-275146, 112కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయవచ్చన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ



విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తోరణగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం గురువారం చొన్నూరు హంబలి బండ్రి గ్రామ విత్తనాల కేంద్రంలో రైతులకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. తహసీల్దార్ అనిల్ కుమార్ కృషి ఇలాఖా అధికారి మంజునాథ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బళ్లారిరూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ అయ్యన్నగౌడ పాటిల్ సూచించారు. నగరంలో గురువారం వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐలు మహమ్మద్ రఫీ, మాంతేష్, రవిచంద్ర, ట్రాఫిక్ పోలీసులు పాల్గొని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● న్యాయాధికారి రాజేష్ ఎన్ హొసమనె



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేష్ ఎన్ హొసమనె

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా న్యాయాధికారి రాజేష్ ఎన్. హొసమనె అన్నారు. నగరంలోని డాక్టర్ జోళదరాసి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. జిల్లా చట్టసేవ ప్రాధికర, జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, అటవీ శాఖ, పాఠశాల విద్యాశాఖ, స్కౌట్స్ అండ్ గైడ్స్ కర్ణాటక రాష్ట్ర మాలిన్య నియంత్రణ మండలి, బళ్లారి ఆర్టీవో కార్యాలయం సంయుక్తంగా నిర్వహించారు. భూమికి 5 బిలియన్ సంవత్సరాల చరిత్ర ఉందని, ప్రకృతిలో సకల జలచర జీవరాసులు మనిషి జీవితంతో ముడిపడి ఉన్నాయన్నారు. అందులో పరిసరాలు ముఖ్యమైనదన్నారు. పరిసరాలకు మానవుని అవసరం లేదని, అయితే మానవునికి పరసరాలు అతి ముఖ్యమైనదన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మానవుడు అనేకమైన ఆవిష్కారాలతో ముందుకు సాగుతున్నాడని, ఈ దిశలో కొంతమేర సమయపాలన చేయాలని అభిప్రాయ పడ్డారు. అనంతరం జిల్లా వాయు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ కార్యాలయ అధికారి టి.ఎం. సిద్దేశ్వర బాబు మాట్లాడుతూ ప్రపంచంలో సకల జీవులు బతకడానికి పరిసరాలు అత్యవసరమన్నారు. అనంతరం నిర్వహించిన చిత్రకళ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లాఅడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, భూగర్భ జల, భూ విజ్ఞాని అరుణ్, బళ్లారిబిజినెస్ కళాశాల డైరెక్టర్ అమర్ రాజ్ భూపాల్, కన్నడ ఉపన్యాసకులు ప్రభాకర్ జోయిస్, స్కౌయిర్ కంపెనీ సీఈఓ మంజునాథ్, జిల్లా స్కౌట్స్ గైడ్స్ విభాగం ట్రైనర్ నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..: జిల్లా చట్టసేవ ప్రాధికర, బళ్లారి న్యాయవాదుల సంఘం, అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ మాలిన్యాన్ని అరికట్టాలి అనే నినాదంతో గురువారం నగరంలోని తాళూరు రోడ్డులో ఉన్న జిల్లా న్యాయాలయ సంకీర్ణం ఆవరణలో న్యాయాధికారులు వివిధ రకాల మొక్కలు నాటారు. ఒకటవ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి ప్రమోద్.బి.జి, అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి రాఘవేంద్ర గౌడ, 3వ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టున్యాయాధికారి డి.పి. కుమారస్వామి, 4వ అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి వాసుదేవ రాధకాంత్ గుడి, జిల్లా ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయాధికారి వెంకటేష్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీం ముజావర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన న్యాయాధికారులు

తుంగభద్రలో పర్యాటకుల సందడి



మునిరాబాద్ సమీపాన తుంగభద్ర జలాశయం బ్యాక్‌వాటర్ వద్ద పర్యాటకుల సందడి

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రుతుపవనాలు రాకమునుపే వర్షాలు కురవడంతో తుంగభద్ర జలాశయానికి అధిక ప్రమాణంలో వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం కొత్తనీటితో కళకళలాడుతోంది. జలాశయం సందర్శకులతో ఆకట్టుకుంటోంది. తుంగభద్ర జలాశయం గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తిలో హొసపేట, కొప్పళ జిల్లా పరిధిలోని మునిరాబాద్ నిర్మాణం కావడంతో ప్రధాన కట్టడం హొసపేటకు చేరువలో ఉండడంతో అధిక సంఖ్యలో సందర్శకులు హొసపేట వైపు చేరుకుని జలాశయం అందాలని ఆస్వాదిస్తుంటారు. జలాశయం మరో చివర మునిరాబాద్‌కు ఆనుకుని ఉండడంతో ఆ భాగంలో జలాశయంలో నీటి అలలు నది తీరాలను తాకుతూ కెరటాలు పైకి ఎగిసి పడుతున్న దృశ్యాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. నదీ తీరానికి చేరుకుని ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతున్న దృశ్యాలు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. తుంగభద్ర జలాశయం పై భాగం ప్రాంతాలైన ఖుదరేముఖ, ఆగొంబె వర్నాడు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగ, భద్ర నదులు పూర్తి స్థాయినిలో నిండాయి. ఇప్పటి శివమొగ్గ వద్ద నిర్మించిన తుంగ జలాశయం పూర్తి స్థాయిలో నిండడంతో దిగవకు నీరు వదిలగా, ఆ నీరు నేరుగా తుంగభద్ర జలాశయంలో వచ్చి చేరుతుండడంతో ఈ ఏడాది కొత్త నీరు 20 రోజులు ముందుగానే జలాశయానిక చేరుకోవడం విశేషం.

ఘనంగా తిరంగా యాత్ర



250 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరావినహడగలిలో ఉగ్రవాదులపై భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో గురువారం పట్టణంలో భారీ తిరంగా యాత్ర చేపట్టారు. బీజేపీ మండల నాయకులు, మాజీ సైనికులు, వివిధ సంస్థలు కలిసి సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో 250మీటర్ల పొడవైన తిరంగాను ఊరేగించారు. రాజకీయ నాయకులు, పాఠశాలల విద్యార్థులు, అధికారులు త్రివర్ణ జెండాను మోసుకెళ్లారు. సేవాలాల్ భవన్ నుంచి ప్రారంభమైన యాత్ర కిత్తూరు చన్నమ్మ సర్కిల్, ఏపీజే అబ్దుల్ కలాం సర్కిల్, సువర్ణమహోత్సవ సర్కిల్, లాల్ బహదూర్ శాస్త్రి సర్కిల్ మీదుగా ప్రధాన వీధుల గుండా హనుమప్ప దేవాలయం వద్ద యాత్ర ముగిసింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణానాయక్, మాజీ ఎమ్మెల్యే నందిహళ్ళి హాలప్ప, బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రిటైర్డ్ సైనికుడు అశోక, పునీత్ దొడ్డమని, పుత్రేశ, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్రగౌడ, మున్సిపల్ అధ్యక్షురాలు జమాల్‌బీ, నాయకలు బీరబ్బి బసవరాజు, మల్లికార్జున పూజార్, లింగరాజు, శశిధర, కొడిహళ్ళి కొట్రేశ్, లక్ష్మణనాయక్, సిరాజ్ బావిహళ్ళి శంకర్ నవలి పాల్గొన్నారు.

కుక్క కాటుకు రేబిస్ టీకా వేయించుకోండి

● జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కుక్కకాటుకుగురైన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రేబిస్ టీకాలు వేయించుకోవాలని జిల్లాసర్వేయర్ డాక్టర్ మరియంబి సూచించారు. జిల్లాయంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, సర్వే యూనిట్, మున్సిపల్ కార్పొరేషన్, ఆశ్రయ కాలనీ సంయుక్తంగా కౌల్‌బజార్‌లోని దానప్ప వీధిలో కుక్క, పాముకాటుపై అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడారు. ఏ కుక్క కరిచినా, గోళ్లతోగీకినా, మన శరీరంపై ఉన్న గాయాన్ని నాలుకతో నాకినా మనం దానిని తేలికా తీసుకోరాదన్నారు. కాటు వేసిన ప్రదేశాన్ని సబ్బు నీటితో కడగాలని, వైద్యుడి సలహామేరకు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు వేయించుకోవాలన్నారు. ఒక వ్యక్తిని రేబిస్ సోకిన కుక్క కరిస్తే యాంటీరేబిస్ వ్యాక్సిన్ తీసుకోకపోతే రేబీస్ వచ్చే అవకాశం ఉందన్నారు. పాము కాటు వేసినపుడు భయపడకుండా కాటు వేసిన భాగం గుండె కింద ఉండేలా చేసుకోవాలన్నారు. వెంటనే ఆ వ్యక్తిని సమీపంలోని ఆస్పత్రికి తరించాలని సూచించారు. వ్యక్తికి ఆటంకం కలిగించే చేతి గడియారాలు, ఉంగరాలు, మొదలైన వాటిని తీసివేయాలన్నారు. కాటు వేసిన భాగాన్ని కదలకుండా చూసుకోవాలని వైద్యాధికారి కాశీ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, పరిశుభ్రమైననీటి ప్రాముఖ్యత, చేతులు కడుక్కోవడం వంటి పద్ధతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, అంటువ్యాధుల నిపుణురాలు డాక్టర్ విశాలాక్షి, పొగాకు నియంత్రణ విభాగం సరస్వతి,జిల్లా కలరా నియంత్రణ బృందం శివకుమార్, తిప్పేస్వామి, ఉమాదేవి, సవిత,ఖాసీం, వలి, మహాలింగ, దుర్గాప్రసాద్, దానకుమారి, కౌసర్, విజయలక్ష్మి, సుమిత్ర, రాధిక, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ మునిరాజు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంతో బెర్నార్డో హిగ్గిన్స్ విశ్వవిద్యాలయం ఒప్పందం

బళ్లారి సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, శాంటియాగో చిలీలోని బెర్నార్డో హిగ్గిన్స్ విశ్వవిద్యాలయం విద్యా అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఒప్పందం తర్వాత, ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు, ఆవిష్కరణలు, నాణ్యమైన పరిశోధనల భవిష్యత్తును ప్రోత్సహించడానికి ముఖ్యమైనవని విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఇది మూడవ ఒప్పందం అన్నారు. ఆశించినస్థాయిలో నాణ్యమైన పరిశోధనా వ్యాసాలు, మంచి విద్యకు అవసరమైన అంశాలను సాధించడానికి విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ఒప్పందంపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. బెర్నార్డో హిగ్గిన్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీజర్ మోరల్స్ వెర్డెజో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలతో ఉన్నత విద్యను పంచుకోవడమే మా లక్ష్యం అన్నారు. ఇది ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రపంచ పరిశోధనలకు వేదిక కానుందన్నారు. అనంతరం విద్యా ఒప్పందంపై పరస్పరం సంతకాలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వాల్యుయేషన్ రిజిస్ట్రార్ రుద్రేశ్, హనుమేశ్ వివిధ ఫ్యాకల్టీల డీన్లు, సైన్స్ విభాగాల అధిపతులు, పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

● కాంగ్రెస్ నాయకుడు హరిప్రసాద్ డిమాండ్



బళ్లారి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆర్‌సీబీ క్రికెట్ టీం జరిపిన విజయోత్సవ సభలో తొక్కిసలాట జరిగిన ఘటనలో మరణించిన 11 మంది కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి బీసీసీఐ రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌సీబీ క్రికెట్ టీం అనేది కర్నాటక టీం ఏమీ కాదని, ఒక ఏజెన్సీ కింద నడుస్తోందన్నారు. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించడం, వందల సంఖ్యలో గాయపడడం చూస్తే బాధగా ఉందన్నారు. ప్రభుత్వపరంగా విధానసౌధలో ప్లేయర్లకు సన్మానం జరిగిందన్నారు. అక్కడ అంతా ప్రశాంతంగానే ఉందని, స్టేడియంలో ఎక్కవ మంది అభిమానులు రావడం వల్ల తొక్కిసలాటకు కారణమైందన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యామా? పోలీసుల విఫలమా..? అనేది చెప్పలేమన్నారు. ఆ నివేదిక సీఎం, హోంశాఖ, ఉప ముఖ్యమంతి ఇస్తారన్నారు. కానీ స్టేడియంకు వచ్చే అభిమానులను అంచనా వేసి భద్రత కల్పించి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదన్నారు.

పాఠ్యపుస్తకాలు, బ్యాగుల పంపిణీ



మారుతినగర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న గౌస్

కంప్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గణేష్ పుట్టిన రోజు సందర్భంగా మారుతినగర్ (సీపిరిదిన్ని)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమాజ సేవకుడు గౌస్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. గౌస్ మాట్లాడుతూ పేద విద్యార్థులను దృష్టిలో వుంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు పండ్లు, పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గణేష్ మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకుని ఆకాంక్షించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో 60 అడుగుల కటౌట్‌కు హొసకోటి జగదీష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ప్రయాణికులకు కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఖాదర్ బాషా, సంజీవరాయ బీమ బట్ట ప్రసాద్, మూకయ్యస్వామి, సుధీర్, నారాయణప్ప, గోపాల కృష్ణ, వీరాంజనేయులు, గంగాధరగౌడ, మరిగౌడ, శంకరప్ప, హేమయ్యస్వామి, బర్మానగౌడ, టీవీ గౌడ పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కంప్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సిరిగేరి సమీపంలోని గుండిగనూరు గ్రామంలో గురువారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీనిపై సిరిగేరి పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. గుండిగనూరు గ్రామానికి చెందిన శేకప్ప అనే రైతు రెండు గడ్డివాములకు ఆకస్మికంగా మంటలు చెలరేగి కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్న సమయంలో మంటలు రావడంతో వెంటనే కురుగోడు ఫైర్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. ఫైర్ సిబ్బంది వచ్చేలోపు పశుగ్రాసం మంటల్లో కాలిపోయింది. అధికారులు స్పందించి రైతుకు పశుగ్రాసం అందించి ఆదుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా హెచ్చెల్సీ వంతెన..!

● పట్టించుకోని అధికారులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బళ్లారి-బెంగళూరు వెళ్లే రాష్ట్ర రహదారి 150పై హెచ్చెల్సీ 99 కిలోమీటరు వద్ద కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని పక్కనే రైల్వే లైన్ ఉండడంతో వంతెనను వెడల్పు చేయలేని పరిస్థితి నెలకొంది. 20 ఏళ్ల క్రితం రాష్ట్ర రహదారి 150 అభివృద్ధి పరిచే సమయంలో ఈ వంతెనను వెడల్పు చేసి ఉండాల్సింది. అయితే వంతెన టీబీ బోర్డు పరిధికి వస్తుండడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఐరెన్ కాంక్రీట్ ఫెన్సింగ్ కూలిపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం వంతెనపై కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో నిత్యం వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో వాహనాల సంచారానికి ఆటకం ఏర్పడుతోంది. ఇదే మార్గం గుండా బెంగళూరు నుంచి బళ్లారి మీదుగా, గుల్బర్గా, బీజాపూర్, రాయచూరు, బాగల్ కోట, కొప్పళ జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడం తో నిత్యం వాహన సంచారం అధికంగా ఉంటుంది. రాష్ట్ర రాహదారుల శాఖ అధికారులు, టీబీ బోర్డు అధికారులతో చర్చించి శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



వంతెనపై ఇరుకుగా ఉన్న రోడ్డు

హోసూరు జోన్

మామిడి దిగుబడి ఫుల్.. ధర నిల్..!



కోతకు సిద్ధంగా ఉన్న మామిడిని చూపుతున్న రైతు

కృష్ణగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి అంటే మామిడి పండ్లకు సీజన్. పండ్లలో రారాజుగా ఉన్న మామిడిపంట కూడా ఆశాజనకంగా ఉంది. అయితే పలు కారణాలతో సరైన ధర లేకపోవడంతో నిరాశగా ఉందని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా సుమారు 45వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతోంది. బంగినపల్లి, సెంచురా, ఖాదర్, మల్‌గోవా, పీతర్, మల్లికా, బెంగళూరు, రుమాని వంటి 20కుపైగా రకాలు ఎంతో రుచికరంగా ఉంటాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈయేడు మామిడి దిగుబడి పెరిగింది. స్థానికంగా పండించి మామిడి ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అయ్యేది అయితే ఈసారి లేకపోవడంతో స్థానికంగా ధరలు లేవు. ఫ్యాక్టరీలకు పంపాలన్నా కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మామిడి విక్రేతలంతా కలసి సిండికేట్‌గా ఏర్పడి కిలో రూ.5 నుంచి 7 చొప్పున కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనివల్ల విపరీతమైన నష్టం ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం చొరవచూపి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

తరగతి గదులకు మరమ్మతులు చేయండి



క్రియానపల్లిలోని ప్రభుత్వ పాఠశాల

హోసూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పలుచోట్ల పాఠశాల తరగతి గదులు ఇంకా మరమ్మతులకు నోచుకోలేదు. కృష్ణగిరి జిల్లాలోని తెంగానికొట్టై సమీపాన ఇరుతుకొట్టై పంచాయతీ పరిధిలోని క్రియానపల్లిలో ఒక పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 60మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. కొంతకాలంగా పాఠశాల పైకప్పు పెచ్చులూడుతూ విద్యార్థులను బెంబేలెత్తిస్తోంది. జోరువానలు కురిసినప్పుడు లీకేజీ అవుతోంది. తరగతి గదులకు మరమ్మతులు చేపడితేగానీ పాఠశాలకు పంపేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా విద్యార్థులు వస్తున్నప్పటికీ మళ్లీ వెంటనే వాపసు పిలుచుకుని వెళ్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకముందే తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కాగా పాఠశాల చుట్టూ క్వారీలు ఉన్నాయని, పేలుళ్లకారణంగా తరచుగా గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని అంటున్నారు.



పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు